

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీశైలంలో హైదరాబాద్‌కు చెందిన ఉమామహేశ్వరి కూచిపూడి నృత్యాలయ వారి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



మెడి'కల' సాకారానికి వేళాయె!

నంద్యాల మెడికల్ కళాశాల నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. ఆగస్టులోనే అడ్మిషన్లు చేపట్టి ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

8లో▸



టీబీ డ్యాంకు వరద

హొళగుంద: తుంగభద్ర జలాశయానికి భారీగా వరద వస్తోంది. ఎగువన ఉన్న గాజనూరు జలాశయం 10 గేట్లను ఎత్తి 16,151 క్యూసెక్కుల దిగువకు వదిలారు. ఆ నీరు టీబీ డ్యాంకు వస్తోంది.

న్యూస్‌రీల్

త్వరలో క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ సంజీవకుమార్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో త్వరలో స్టేట్ క్యాన్సర్ యూనిట్‌ను ప్రారంభించనున్నట్లు కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్. సంజీవకుమార్ చెప్పారు. శుక్రవారం ఆయనను కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, క్యాన్సర్ హెచ్‌వోడీ డాక్టర్ సీఎస్‌కే. ప్రకాష్ కలిసి క్యాన్సర్ యూనిట్ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద క్యాన్సర్ హాస్పిటల్ కర్నూలులో త్వరలో ప్రారంభం కాబోతుందన్నారు. దీనికి సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. అందులో వైద్యులు, సిబ్బంది, మెడికల్ పరికరాలు తదితర విషయాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పెన్షనర్ల ఈ- కేవైసీకి 18 వరకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం నుంచి పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులందరూ రాష్ట్ర ఖజాన, లెక్కల శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 18లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు తెలిపారు. జిల్లాలో 17,072 మంది పెన్షన్‌దారులు ఉండగా.. ఇప్పటి వరకు 14,904 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారని తెలిపారు. పెన్షనర్ల సౌలభ్యం కోసం శని, ఆదివారాల్లో కర్నూలు సీ.క్యాంపులోని కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రూ.2.20 కోట్ల విత్తనాలు సీజ్



తనిఖీ చేస్తున్న జిల్లా స్క్వాడ్ బృందం

ఎమ్మిగనూరు: కల్తీలను అరికట్టేందుకు వ్యవసాయాధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మూడు రోజులుగా విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎమ్మిగనూరు టౌన్, నందవరం, నాగలదిన్నె, గోనెగండ్లలో రూ.2.20 కోట్లు విలువచేసే విత్తనాలను సీజ్ చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని శివశంకర్ ఫెర్టిలైజర్స్‌లో తనిఖీ చేసి రూ.24.50 లక్షలు విలువచేసే విత్తనాలను సీజ్ చేశారు. అనంతరం నవభారత్ సీడ్స్‌లో తనిఖీలు చేశారు. అక్కడ లక్షలు విలువచేసే విత్తనాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో కర్నూలు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, శివశంకర్‌రెడ్డి, ఎమ్మిగనూరు ఏఓ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బలగం'తో మంచి గుర్తింపు



వేణు ఎల్దండి

వెల్దుర్తి: బలగం సినిమాతో తనకు మంచి గుర్తింపు వచ్చిందని దర్శకుడు వేణు ఎల్దండి అన్నారు. శుక్రవారం ఆయన మాటల రచయిత పెద్దింటి అశోక్ కుమార్‌తో కలిసి బ్రహ్మగుండం క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. వెండితెర, బుల్లితెర హాస్య నటునిగా, జబర్దస్త్ వేణుగా తాను ప్రేక్షకులకు సుపరిచితమేనన్నారు. తాను దర్శకత్వం వహించిన బలగం సినిమాకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు 20 వరకు వచ్చాయన్నారు. రాబోవు రోజుల్లో తెలుగుజాతి గర్వపడేలా మరిన్ని సినిమాలు తీసేందుకు కృషి చేస్తానన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు, వెల్దుర్తి సింగర్ (నేపథ్య గాయకుడు) సురేశ్ నాయుడు తదితరులు వేణును శాలువాలతో సత్కరించారు.


టీటీడీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పోటీలు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో పోటీలు ఉంటాయని, పోటీల తేదీలు త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశాస్తమని, మరిన్ని వివరాలకు 9059802265 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కరువు నేలకు రాజయోగం

- జలయజ్ఞంతో సాగునీటి ప్రాజెక్టులకు ఊపిరి
- వైఎస్సార్ హయాంలో పోతిరెడ్డిపాడు విస్తరణ పనులు
- పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచిన సీఎం వైఎస్ జగన్
- తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులు పూర్తి
- అవుకు రెండు టన్నెల్‌ను సిద్ధం చేసిన ఇంజినీర్లు

వైఎస్సార్.. బీడు బారిన నేలకు జల సిరులందించిన అపరభగీరథుడు.. లయ తప్పిన పేద గుండెకు ఊపిరులూదిన దైవం.. ఆసరా లేని వృద్ధులను ఆదుకున్న ఆపన్నహస్తం.. అన్నదాత కష్టాలను ఒక్క సంతకంతో మాఫీ చేసిన రైతు బాంధవుడు.. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో కొలువైన మహానేత.. నేడు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..





పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్

కర్నూలు సిటీ: వైఎస్సార్.. ఆ పేరు వినగానే అందరి గుండెలు ఉప్పొంగుతాయి. సీఎంగా ఐదేళ్ల కాలంలో ఐదు శతాబ్దాల చరిత్రను ఆయన లిఖించారు. జలయజ్ఞంతో సాగునీటి ప్రాజెక్టులకు ఊపిరి పోశారు. పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11,500 క్యుసెక్కుల నుంచి 40 వేల క్యుసెక్కులకు పెంచేందుకు 2005 సెప్టెంబరు 13న మొదట రూ.1,252 కోట్లకు అనుమతులు ఇచ్చారు. ఆ తరువాత 2006 జనవరి 4న 44 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచేందుకు రూ.2,155 కోట్లకు అంచనాను పెంచి ఎస్ఆర్ఎంసీ కాలువను సైతం విస్తరించారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి రాయలసీమకు మరింత మేలు చేసేలా పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని మరింత పెంచారు. 40 రోజుల్లోనే వరద జలాలను తరలించేందుకు పోతిరెడ్డిపాడు నుంచి బానకచర్ల వరకు విస్తరణ పనులు, అలాగే గోరుకల్లు వరకు ఎస్ఆర్‌బీసీ కాలువ విస్తరణ పనులు రూ.1,166 కోట్లతో పూర్తి చేయించారు. దీంతో పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుంచి మూడేళ్లుగా 44 వేల క్యుసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాటు గోరుకల్లు రిజర్వాయర్ సామర్థ్యం 12.95 టీఎంసీలకు పెంచుతూ.. రూ.287.5 కోట్లతో ఇన్‌ఫాల్ రెగ్యులేటర్ పనులు పూర్తి చేశారు.

హంద్రీ–నీవాతో జలసవ్వడులు

హంద్రీనీవా కాలువ ఏర్పాటు చేసి కృష్ణాజలాలను తీసుకొచ్చి కర్నూలు జిల్లాలోని పశ్చిమప్రాంతాన్ని వైఎస్సార్ సస్యశ్యామలం చేశారు. కృష్ణగిరి, పందికోన రిజర్వాయర్లను ఏర్పాటు చేసి దాదాపుగా 70వేల ఎకరాలకు సాగు నీరు అందించే దిశగా చర్యలు తీసుకున్నారు. దేవనకొండ, తుగ్గలి, కృష్ణగిరి, డోన్ మండలంలోని 50 గ్రామాలకు, డోన్ పట్టణానికి గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా రూ. 55కోట్లతో తాగునీరు అందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీ–నీవా కాలువ నుంచి 68 చెరువులకు నీరు మళ్లించే పనులకు నిధులు మంజూరు చేశారు. అలాగే కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి వెల్దుర్తి పట్టణానికి రూ.3 కోట్లతో శాశ్వత తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు.

అవుకు రెండో టన్నెల్ పూర్తి

జలయజ్ఞంలో భాగంగా రెండు టీఎంసీల సామర్థ్యం ఉన్న అవుకు రిజర్వాయర్‌ను రూ. 70కోట్లతో నాలుగు టీఎంసీల సామర్థ్యానికి పెంచేందుకు 2005 నవంబర్‌లో వైఎస్సార్ శంకుస్థాపన చేశారు. దీని ద్వారా కర్నూలు, వైఎస్సారస్ జిల్లాల్లో 77,200 ఎకరాలకు సాగునీరు, రిజర్వాయర్‌కు అనుసంధానంగా గాలేరు–నగరి వరద కాల్వ నుంచి కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 2.67లక్షల ఎకరాలకు సాగునీరు, 640 గ్రామాల్లో 20లక్షల మందికి తాగునీరు అందించాలన్నది లక్ష్యం. శ్రీశైలం జలాశయం నుంచి అవుకు రిజర్వాయర్‌లోకి నీరు చేరేందుకు 30వ ప్యాకేజీ కింద రూ. 401కోట్లతో 12కి లోమీటర్ల మేర రెండు సొరంగమార్గాలను ఏర్పాటు చేసి వీటి ద్వారా 20వేల క్యూసెక్కుల వరద జలాలను రిజర్వాయర్‌లో నింపాల్సి ఉంది. వైఎస్సార్ మరణం తర్వాత పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అవుకు టన్నెల్ పనులను పరుగులు పెట్టించారు. పెండింగ్‌లో ఉన్న అవుకు రెండో టన్నెల్ పనులకు రూ.108.49 కోట్లు మంజూరు చేసి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేయించారు.


తెలుగుగంగ..

తెలుగుగంగ కాలువకు (బానకచర్ల కాంప్లెక్ నుంచి వెలుగోడు రిజర్వాయర్ వరకు)లైనింగ్ లేకపోవడంతో నీరు వృథా అయ్యేది. అలాగే డిస్ట్రిబ్యూటరీలకు, ప్రధాన కాలువ రెండు దశబ్దాలుగా మరమ్మతులు లేవు. దీంతో 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. తెలుగుగంగ కాలువ డిస్ట్రిబ్యూటరీ 21 నుంచి 37 వరకు రూ.40 కోట్లతో పనులు పూర్తి చేయించారు. 2010 నుంచి మిగతా పనులు పూర్తి చేసేందుకు అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. నిధులు మంజూరు చేయడంతో పనులు మొదలు పెట్టారు. పనులు పూర్తయితే సుమారుగా 50 వేల ఎకరాలకు సమృద్ధిగా సాగు నీరు అందనుంది.

నేడు రైతు దినోత్సవం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ వ్యవసాయాన్ని పండుగ చేశారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందజేశారు. రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నారు. రైతుబాంధవుడిగా గుర్తింపు పొందిన వైఎస్సార్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రైతుదినోత్సవంగా నిర్వహిస్తోంది. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వైఎస్సార్ హయాంలో రైతులకు జరిగిన మేలును వివరించనున్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని పెండింగ్‌లో ఉన్న వైఎస్ఆర్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, వైఎస్ఆర్ పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ప్రారంభించనున్నారు. అలాగే 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 2,35,743 మంది రైతులకు రూ.192.51 కోట్ల పరిహారం లభించనుంది. సునయన ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు బీమా పరిహారం మెగా చెక్‌ను విడుదల చేయనున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరులో నిర్మించిన వైఎస్సార్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్, పశు సంవర్ధకశాఖకు సంబంధించి గూడూరు, పాణ్యం, బనగానపల్లెలో నిర్మించిన వైఎస్ఆర్ పశువ్యాధి నిర్ధారణ కేంద్రాలను ప్రారంభిస్తారు.

వైఎస్సార్ హయాంలో జరిగిన మేలు..



- ➡ పండ్లతోటల అభివృద్ధితోనే కరువు నివారణ సాధ్యమని భావించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం కింద డ్రైల్యాండ్ హార్టికలర్‌ను ప్రోత్సహించారు.
- ➡ ప్రతి కుటుంబానికి అంతో.. ఇంతో స్థిరాస్తి ఉండాలనే లక్ష్యంతో భూ పంపిణీ పేరుతో ప్రభుత్వ భూములను సాగు నిమిత్తం పంపిణీ చేశారు. వైఎస్సార్ హయాంలో 1.20 లక్షల మంది రైతులకు 1.35 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారు.

నాలుగేళ్లలో రైతులకు రూ.2,926 కోట్ల లబ్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. తండ్రికి తగ్గ తనయుడనే పేరు సంపాదించారు. నాలుగేళ్లలో రైతులకు రూ.2,926.54 కోట్ల లబ్ధి చేకూర్చారు.వైఎస్ఆర్ రైతుభరోసా కింద రూ.1667.44 కోట్లు ఇచ్చారు. రూపాయి ప్రీమియం చెల్లించకపోయినప్పటికీ రైతులకు రూ.1,108.78 కోట్ల వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా అమలు చేశారు. 2020 నుంచి ఇప్పటి వరకు అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు రూ. 117.12 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించారు. వైఎస్ఆర్ సున్నా వడ్డీ కింద రూ. 72.31 కోట్లు ఇచ్చారు. వైఎస్ఆర్ యంత్రసేవ పథకం కింద రూ. 17.73 కోట్లు, ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాలకు రూ. 15.47 కోట్లు అందజేశారు.

నేడు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. కర్నూలులోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఉదయం 9:45 గంటలకు కార్యకర్తల మధ్య కేక్ కట్ చేయనున్నారు. ఆలూరు నియోజకవర్గంలోని గూళ్యం గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం నివాళి అర్పించనున్నారు. ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కల్లూరులోని శరీన్ నగర్, పందిపాడులో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో కర్నూలు, గూడూరు, కోడుమూరు, సీ. బెళగల్ మండలాల్లోని వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పంపిణీ చేయనున్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జ్ మురళీరెడ్డి కోసిగిలో రక్తదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కర్నూలులోని ఎస్‌బీఐ సర్కిల్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.

రాయలసీమ విశ్వవిద్యాలయం వైఎస్సార్ చలువే



రాయలసీమ విశ్వవిద్యాలయం

కర్నూలు (న్యూసిటీ): జిల్లాకో విశ్వవిద్యాలయం ఉండాలని లక్ష్యంతో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాయలసీమ విశ్వవిద్యాలయం స్థాపించారు. 2008 సెప్టెంబర్ 24వ తేదీన రాష్ట్ర శాసన సభలో గెజిట్‌లో 29వ చట్టం అనుసరించి యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. 1977లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రెండు కోర్సులతో కర్నూలులో చిన్న భవనంలో పీజీ సెంటర్‌ను ప్రారంభించింది. దానిని 1979లో పాత మున్సిపల్ కార్యాలయ భవనంలోకి మార్చారు. 1990లో కర్నూలు సమీపంలోని బి.తాండ్రపాడు గ్రామం వద్ద ఉన్న 300 ఎకరాల విస్తీర్ణంలో పీజీ సెంటర్‌ను సొంత భవనంలోకి మార్చారు. 1993లో ఈ కేంద్రాన్ని శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి బదిలీ చేశారు. 2008లో యూనివర్సిటీగా మారింది. 2019– 20లో రాయలసీమ వర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించారు. ప్రస్తుతం వర్సిటీలో 14 పీజీ కోర్సులు ఉన్నాయి. విద్యార్థులు 2 వేల మంది, ప్రొఫెసర్లు 60 మంది, నాన్ టీచింగ్ సిబ్బంది 150 మంది ఉన్నారు.

సీఐ, ఎస్ఐలకు స్థానచలనం

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏడుగురు సీఐలకు, ఆరుగురు ఎస్ఐలకు స్థానచలనం కలిగింది. వారు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం నుంచి మరో సర్కిల్‌కు బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కారణంగా ఈ బదిలీలు జరిగినట్లు పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది.

సీఐలు..

పేరు	పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
మల్లికార్జున గుప్త	వీఆర్, నంద్యాల	పీసీఆర్, నంద్యాల
ఇస్మాయిల్	పీసీఆర్, నంద్యాల	నంద్యాల ట్రాఫిక్
ప్రియతమ రెడ్డి	బేతంచర్ల యూపీఎస్	డీఎస్‌బీ, నంద్యాల
సుగుణ కుమారి	డీఎస్‌బీ-2, నంద్యాల	సీసీఎస్, కర్నూలు
జయరాములు	వీఆర్, నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
దస్తగిరి బాబు	డీఎస్‌బీ, నంద్యాల	నంద్యాల తాలూకా
ఆర్.జి.సుబ్రహ్మణ్యం	ఆత్మకూరు	వీఆర్, కర్నూలు
ఎస్ఐలు..		
పి.సుధాకర్‌రెడ్డి	పాణ్యం	డోన్ రూరల్
కె.జగదీశ్వర్ రెడ్డి	డోన్ రూరల్	నంద్యాల వీఆర్
పి.అశోక్	డీఎస్‌బీ నంద్యాల	పాణ్యం పీఎస్
కె.మల్లికార్జున	చిప్పగిరి	బండి ఆత్మకూరు
టి.బాబు	బండిఆత్మకూరు	నంద్యాల త్రీటౌన్
డి.వెంకటనారాయణ	డీఎస్‌బీ, కర్నూలు	ఆత్మకూరు

దిగులు తీరుస్తూ.. ధీమా ఇస్తూ!

- ప్రజల అభిమానాన్ని చూరగొంటున్న జగనన్న సురక్ష క్యాంపులు
- జిల్లాలో ఏడో రోజూ 16,465 మందికి సర్టిఫికెట్ల అందజేత
- మరికొంత మందికి సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో చోటు
- క్యాంపుల ప్రాధాన్యతను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

కర్నూలు(సెంట్రల్): సమస్యల పరిష్కారం, సంక్షేమానికి వేదికైన జగనన్న సురక్ష క్యాంపులు ప్రజల దిగులు తీరుస్తూ..ధీమాను ఇస్తున్నాయి. ముందుగా క్యాంపుల సమాచారం తెలియజేస్తుండడంతో ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ మాదిరిగా ప్రజల చెంతకే వచ్చి వివిధ ధ్రువ పత్రాల జారీతో పాటు అర్హులైన వారిని సంక్షేమ పథకాల అర్హుల జాబితాతో చేర్చలేదు. ఈ క్రమంలో నిర్వహిస్తున్న సురక్ష క్యాంపులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

24 సచివాలాయల పరిధిలో క్యాంపుల నిర్వహణ..

కర్నూలు జిల్లాలో జగనన్న సురక్ష క్యాంపుల నిర్వహణ పకడ్బందీగా కొనసాగుతోంది. ఏడో రోజు జిల్లాలో 24 సచివాలయాల పరిధిలో క్యాంపులు నిర్వహించారు. ఇందులో 16,465 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కోడుమూరు ఎమ్మెల్యే జే.సుధాకర్ కర్నూలు రూరల్ మండలంలోని కొంతలపాడు, తులశాపురంలలో జరిగిన క్యాంపుల్లో పాల్గొని ప్రజలకు సంక్షేమ పథకాల ధ్రువీకరణను అందజేశారు. అనంతరం ప్రజలకు కావాలని దరఖాస్తు పెట్టుకున్న వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 47వ వార్డు సచివాలయంలో జరిగిన సురక్ష క్యాంపునకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు.

జగన్నాథగట్టు అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.జీ సృజన



జగన్నాథగట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(అర్బన్): నగర శివారులోని జగన్నాథగట్టు ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె జగన్నాథగట్టు హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జగన్నాథగట్టుపై ట్రిపుల్ ఐటీ, క్లస్టర్ యూనివర్సిటీ, లా కళాశాల, హౌసింగ్ లేఅవుట్ ఉన్నాయని, భవిష్యత్తులో ఇక్కడికి మరిన్ని ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని 50 సంవత్సరాల వరకు ఈ ప్రాంతంలో ఎలాంటి నీటి ఎద్దడికి తావు లేకుండా మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి నగర పాలక సంస్థ కమిషనర్ చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేస్తు ఆమె ఉత్తర్వులు జారీ చేశారు. నీటి వసతి, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సవివరమైన నివేదికలను వారంలోగా తనకు అందించాలన్నారు. అలాగే జగన్నాథగట్టు ప్రాంతంలో ఉన్న నిర్మాణాలకు సరైన రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు కూడా ప్రణాళికలను సిద్ధం చేసి అందజేయాలన్నారు. సమీపంలోని ప్రజానగర్ కాలనీని ఆమె పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్‌డీఓ హరిప్రసాద్, కుడా వైస్ చైర్మన్ ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి, హౌసింగ్ పీడీ కే వెంకటనారాయణ, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ ఉమాపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బీ నాగేశ్వరరావు, డీపీఓ టీ నాగరాజునాయుడు ఉన్నారు.

టీడీపీని ప్రజలు నమ్మరు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు రూరల్: తెలుగుదేశం పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టలేరన్నారు. యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో టీడీపీ నాయకులు బస్సుయాత్ర పేరుతో కొత్త అవతారం ఎత్తి ఊళ్లు తిరుగుతున్నారన్నా రు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందన్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని అర్హులైన వారందరికీ ఇంటి వద్దకే 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అనంతరం గ్రామంలో అర్హులైన 135 లబ్ధిదారులకు ధ్రువప త్రాలు అందించారు. కార్యక్రమంలో మంత్రి సో దరుడు నారాయణ స్వామి, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూ రు శేఖర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న, ఎంపీటీసీ లలితమ్మ, మాజీ జెడ్పీటీసీ రాంభీం నాయుడు, మండల కన్వీనర్ వీరేష్ గ్రామ సర్పంచ్ రాజశేఖర్, తహసీల్దార్ రామాంజినేయులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు

కర్నూలు (న్యూసిటీ): జిల్లాలో వివిధ రహదారుల అభివృద్ధికి ఆర్అండ్‌బీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.36.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 65.147 కి.మీ మేర రహదారులు రూపుదిద్దుకోనున్నాయి. ఇందులో కర్నూలులో జిల్లాకు రూ.11 కోట్లు, నంద్యాల జిల్లాకు 25.50 కోట్లు ఖర్చు చేయనున్నారు. మద్దికెర – పత్తికొండ – దేవనకొండ రోడ్డుకు రూ.5.70 కోట్లు, మద్దికెర –పత్తికొండ – దేవనకొండ రోడ్డుకు రూ.2.30 కోట్లు, గుంతకల్లు – తుంగభద్ర రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు విడుదలయ్యాయి. నంద్యాల – గడివేముల – మిడుతూరు – నందికొట్కూరు రోడ్డుకు రూ.9.70 కోట్లు, వెలుగోడు – గడివేముల – కాల్వ – వెల్దుర్తి – ఈదుల దేవరబండ రోడ్డుకు రూ.8 కోట్లు, డోన్ – రాయచూర్ రోడ్డుకు రూ.50 లక్షలు, ఆళ్లగడ్డ – అహోబిలం రోడ్డుకు రూ.3 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి త్వరలో టెండర్లు పిలువనున్నట్లు శుక్రవారం ఆర్అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు తెలిపారు.

క్లుప్తంగా

మహానందిలో సమాచార కమిషనర్ పూజలు



కమిషనర్ దంపతులను సన్మానిస్తున్న చైర్మన్, ఈఓ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ రేపాల శ్రీనివాస్ శుక్రవారం మహానందికి వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ జనార్దన్ శెట్టి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో వారికి స్వామి,అమ్మ వార్ల ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం



కేసీ కెనాల్‌లో బోల్తాపడిన ట్రాక్టర్

నందికొట్కూరు: ట్రాక్టర్ అదుపు తప్పి కేసీ కెనాల్‌లో బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం చెందాడు. బిజినవేముల గ్రామానికి చెందిన చాకలి మద్దమ్మ, నరసింహులు దంపతుల కుమారుడు మధు (22) కేసీ కెనాల్ వెంట రోడ్డు పనులకు ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తున్నాడు. పగిడ్యాల మండలం నెహ్రూనగర్ సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడటంతో అదుపుతప్పి బోల్తా పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మధు చిన్నతనంలోనే దండ్రి వదిలేసి వెళ్లాడు. తల్లి హైదరాబాద్‌లో కూలీ పని చేస్తు జీవనం సాగిస్తుంది. అమ్మమ్మ నాగేంద్రమ్మ వద్ద ఉంటూ నాగటూరు గ్రామానికి చెందిన రాజేంద్రగౌడు ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పని చేసేవాడు. మృతదేహానికి నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ముచ్చుమర్రి పోలీసు స్టేషన్ ఎస్‌ఐ నాగార్జున చెప్పారు.

మెడి'కల' సాకారానికి వేళాయె!

- శరవేగంగా నంద్యాల మెడికల్ కళాశాల నిర్మాణం
- ఆగస్టులో ప్రారంభించేందుకు సన్నాహాలు
- తొలి ఏడాది 150 ఎంబీబీఎస్ సీట్లకు అడ్మిషన్లు
- అందుబాటులోకి స్పెషలిస్ట్ వైద్య సేవలు



మెడికల్ కళాశాల పనులు జరుగుతున్న దృశ్యం



జనరల్ ఆసుపత్రి భవనం నమూనా

బొమ్మలసత్రం: రోగం వస్తే సుదూర ప్రాంతాలకు పరుగులు పెట్టడం ఒకప్పటి మాట. ఇకపై ఎంతటి అనారోగ్య సమస్య తలెత్తినా పైసా ఖర్చు లేకుండా జిల్లా కేంద్రంలో నయం చేసుకొనేందుకు వీలుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెడికల్ కళాశాలను త్వరలో ప్రారంభించబోతుంది. గతంలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ మాత్రమే ఉండేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తుంది. ఈ క్రమంలో రాష్ట్రంలో మొత్తం 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. మొదటి దశలో 300 పడకల జిల్లా ఆసుపత్రులు ఐదింటిని ఎంపిక చేసింది. ఒక్కో మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.450 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగానే నంద్యాల మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభించి ఈ ఏడాది ఆగస్టు నుంచి 150 సీట్ల అడ్మిషన్లు జరపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మెడికల్ కాలేజీ నిర్మాణంతో పేద విద్యార్థుల కల సాకారం కావడమే కాకుండా నిరుపేదలకు మెరుగైన వైద్యం చేరువ కానుంది. జనరల్ హాస్పిటల్ ఏర్పాటుతో దాదాపుగా 720 పడకల్లో రోగులకు వైద్య సేవలు అందనున్నాయి. ఈ మేరకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) అనుమతిచ్చింది. ఈ ఏడాది నుంచే వైద్య కళాశాలలో ప్రవేశాలు ప్రారంభించి 150 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేసి బోధనా తరగతులు నిర్వహించవచ్చని ఎన్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. మొదటి ఏడాది తరగతుల నిర్వహణకు అవసరమైన భవనాలను ఏపీఎంఎస్‌డీసీ అధికారులు ఇంజినీరింగ్ అధికారులు శరవేగంగా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వైద్యఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఒకసారి, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రెండు సార్లు మెడికల్ కళాశాలను పరిశీలించి పనులు వేగవంతం చేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దీంతో జిల్లా ప్రజల చిరకాల స్వప్నం వచ్చే నెల సాకారం కానుంది.

అధునాతన వసతులతో నిర్మాణం

మెడికల్ కళాశాల భవనం, జనరల్ ఆసుపత్రి భవనాలను ప్రభుత్వం 52.45 ఎకరాల్లో నిర్మిస్తోంది. ఇందు కోసం ప్రభుత్వం రూ.450 కోట్ల నిధులను కేటాయించింది. భవన నిర్మాణాల పనులను కేఎమ్‌వీ ప్రాజెక్ట్ చేపట్టి ఇప్పటికే దాదాపు 95 శాతం పనులను పూర్తి చేసింది. మెడికల్ కళాశాల భవనంలో విద్యార్థుల కోసం అనేక వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఒక్కో విద్యార్థి ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్య అభ్యసించాలంటే ప్రభుత్వానికి దాదాపు రూ.80 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అంత ఖర్చు ప్రభుత్వమే భరించి విద్యార్థులను నిపుణులైన వైద్యులుగా తీర్చిదిద్దనుంది. విద్యార్థులకు అన్ని అధునాత వసతులు కల్పించేలా జీ ప్లస్ 3 ఫ్లోర్లతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో 3 మ్యూజియమ్స్, 8 టీచింగ్ రూమ్‌లు, 8 లేబోరేటరీలు, 2 ఎగ్జామినేషన్ హాల్‌లు, 4 లెక్చరర్ హాల్‌లు ఉంటున్నాయి. రెసిడెన్షియల్, యూజీ హాస్టళ్లు, స్టాఫ్ అకామిడేషన్, వర్కింగ్ స్టాఫ్, నర్సెస్ రూమ్స్, గెస్ట్ హౌస్, స్టూడెంట్ నర్సెస్ హాస్టళ్లు, నర్సింగ్ కాలేజీ భవనం ఉంటుంది. హాస్టల్‌లో డైనింగ్‌హాల్, సెంట్రల్ కిచెన్, లాండ్రీ, సెంట్రల్ డ్రగ్ స్టోర్, బయోమెడికల్ వేస్ట్ రూమ్, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు కానున్నాయి.

30 విభాగాలతో వైద్య విద్యాబోధన....

మెడికల్ కళాశాలలో 30 విభాగాలకు సంబంధించిన వైద్య విద్య విద్యార్థులకు బోధించనున్నారు. బయోకెమిస్ట్రీ, ఫిజియోలజీ, అనాటమీ, పల్మనాలజీ, మైక్రోబయాలజీ, పాథాలజీ, ఈఎన్‌టీ, ఆప్త మాలజీ, సోషల్ ప్రివెన్‌టివ్ మెడిసిన్, ఫోరెన్సిక్, ఓబీజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, డెర్మటాలజీ, డెంటల్, ఆర్థో, పీడియాట్రిక్, అనస్తీషియా, యూరాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జన్, నెఫ్రాలజీ, వైరాలజీ, రేడియోథెరపీ విభాగలలో నిష్ణాతులైన ఆచార్యులచే వైద్య విద్యను బోధించనున్నారు. ఇవే కాకుండా మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసించే 150 మంది విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం బోధన, బోధనేతర సిబ్బందిని ఇప్పటికే సిద్ధం చేసింది. వివిధ విభాగాలకు ప్రొఫెసర్లను, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను వైద్యాధికారులు నియమించారు. ఇందులో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు తొమ్మిది మంది ప్రొఫెసర్లు, 19 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 34 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఇప్పటికే వైద్యాధికారులు నియమించారు. వీరు కాక కళాశాల ప్రారంభం అయ్యేలోగా మరొక 70 మంది దాక పీజీ పూర్తి చేసిన వైద్యులను ప్రభుత్వం నియమిస్తుంది. 2023-24 విద్యా సంవత్సరం నుంచి 150 మెడికల్ సీట్లతో కొత్త కళాశాలలో బోధనా తరగతులను ప్రారంభించనున్నారు.

జనరల్ హాస్పిటల్ భవనంలో వసతులు

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం జనరల్ హాస్పిటల్ అనేక వైద్య సేవలు అందుబాటులోకి తేనుంది. నంద్యాల జిల్లా ఆసుపత్రిలో కేవలం కొన్ని రకాల వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉండేవి. మెరుగైన వైద్యం కావాలంటే వైద్యులు రోగులను కర్నూలు జిల్లా ఆసుపత్రికి తరలించే వారు. ఇకపై జిల్లా కేంద్రంలోనే మెరుగైన వైద్య సేవలు అందుకోనున్నారు. ఓపీడీలు ఎమెర్జెన్సీ, క్యాజువాలిటీ, డయాగ్నోస్టిక్, డైస్, దిశ రూమ్స్, న్యాకో అండ్ ఏఆర్‌టీ సెంటర్, రెండు మెటర్నిటీ ఓటీలు, రెండు లేబర్ రూమ్స్, ఏడు మేజర్ ఆపరేషన్ థియేటర్‌లు ఉంటాయి. 9- ఎన్ఐసీయూ, 15- ఎస్ఐసీయూ, 5- ఐసీయూ, 10- ఆర్ఐసీయూ, 7- బర్న్ వార్డ్స్, 5- మెటర్నిటీ హెచ్‌డీయూ, 20- డయాలసిస్ సేవలతో పాటు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్ విభాగాలతో మొత్తం 504 పడకలు ఏర్పాటు చేయనున్నారు.


'ఆగస్టు నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తాం



2023-24 విద్యా సంవత్సరం నుంచి అకడమిక్ కార్యకలాపాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సిద్ధంగా ఉన్నాం. కళాశాలకు అవసరమయ్యే భవన నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. సిబ్బంది నియామకాలు ఇప్పటికే పూర్తయ్యాయి. 150 మెడికల్ సీట్ల భర్తీకి సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ జి. స్వర్ణలత, నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

రాగులతో రాజశేఖరుడు



నంద్యాల(అర్బన్): మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ 3,620 రాగులతో రాజశేఖరుడి ఊహా చిత్రాన్ని గీచారు. మైక్రో ఆర్ట్ కళతో ఏ3 సైజు డ్రాయింగ్ షీట్‌పై 0.1ఎం.ఎం సైజు రాగి గింజలను క్రమంగా అతికిస్తూ 7గంటల శ్రమతో రాజన్న చిత్రాన్ని అద్భుతంగా గీచారు. అనంతరం చిత్రకారుడు కోటేష్ మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలతో పెద్దాయన అంటే అమితమైన అభిమానం ఉందని, రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, జయంతి, వర్ధంతుల సమయంలో అనేక చిత్రాలను గీచి విమర్శకుల ప్రశంసలు అందుకున్నానన్నారు.

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు		
పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశనగ	రూ. 5,439	రూ. 7,900
పొద్దుతిరుగుడు	రూ. 3,500	రూ. 4,629
ఆముదం	రూ. 4,049	రూ. 5,912
వాము	రూ. 6,307	రూ. 22,899
ఎండుమిర్చి	రూ. 4,899	రూ. 19,001
శనగలు	రూ. 3,960	రూ. 3,960
కందులు	రూ. 7,090	రూ. 9,150
మినుములు	రూ. 6,400	రూ. 6,400
సోయా చిక్కుడు	రూ. 3,930	రూ. 3,930

సచివాలయాల్లో ఈ శ్రామ్ కార్డులు

కర్నూలు(రాజ్‌విహార్): గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ -శ్రామ్ కార్డులు జారీ చేస్తున్నట్లు కార్మిక శాఖ సహాయ అధికారి కేశన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ఈ గుర్తింపు కార్డులు అసంఘటిత కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతాయన్నారు. దరఖాస్తు చేసుకొని వీటిని పొందాలని సూచించారు.

ఎస్టీ కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ బాలుర కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డా.బి రవీంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ , సీఈసీలో 40 సీట్లు, ఒకేషనల్ గ్రూప్‌లో 60 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. నంద్యాల, కర్నూలు, ప్రకాశం, కడప, అన్నమయ్య, పల్నాడు, బాపట్ల గుంటూరు, జిల్లాలకు చెందిన ఎస్టీ గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతిలో సప్లమెంటరీలో పాస్ అయిన విద్యార్థులు కూడ ప్రవేశానికి అర్హులని ఈ నెల 15వ తేదీ లోగా విద్యార్థులు నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. వివరాలకు ఎస్టీ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ (9490957268, 9701124919)ను సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా చీరెసారె మహోత్సవం



ఉత్సవానికి హాజరైన బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరి ఆలయంలో శుక్రవారం చీరెసారె మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా ఆశాఢ బహుళ చవితి రోజున అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి ఉదయం పెద్ద ఎత్తున మహిళలు చీరె సారెతో కోలాటాల మధ్య మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు వచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వరరెడ్డి,ఈఓ రామానుజన్ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పదోన్నతుల ప్రక్రియ రేపటికి వాయిదా



పదోన్నతుల కౌన్సెలింగ్ కోసం వచ్చిన ఉపాధ్యాయులు

కర్నూలు(సిటీ): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ సోమవారానికి వాయిదా పడింది. జిల్లాలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 229 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తున్నారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లిష్ టీచర్ల పదోన్నతుల ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. అయితే గతంలో పదోన్నతులకు నాట్ విల్లింగ్ ఇచ్చిన వారందరూ తమకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. దీంతో పాటు సీనియారిటీ జాబితాలో రెండు మూడు పోస్టులలో పదోన్నతులకు అవకాశం ఉండేవారు ఒక సబ్జెక్టులో నాట్ విల్లింగ్ ఇస్తే మిగిలిన సబ్జెక్టులన్నిటికీ అదే వర్తిస్తుంది అనే నిబంధన విషయంలో స్పష్టత లేకపోవడంతో ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా 2006, 2008 లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు పదోన్నతుల్లో ప్రస్తుతం ఉన్న నిబంధనలే అమలు చేయాలని, నాట్ విల్లింగ్ ఇచ్చిన వారిని సీనియారిటీ జాబితాలో చేర్చితే తమకు అన్యాయం జరుగుతుందని వాదించారు. వివాదాన్ని పరిష్కరించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఇరువురి మధ్య చర్చలు జరిపారు. డీఈఓ రంగారెడ్డితో చర్చించిన అనంతరం అధికారులు పదోన్నతుల ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే మొదటి రోజున (ఈనెల 5వ తేదీన) జరిగిన బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పోస్టుల పదోన్నతులను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అందరికీ ఒకే నిబంధనను అమలు చేస్తూ ఈనెల 9వ తేదీన టౌన్‌మోడల్ హైస్కూల్‌లో అన్ని సబ్జెక్టులు ఒకే రోజున వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేసి పదోన్నతులు కల్పించనున్నట్లు తెలియజేశారు. గతంలో ఏ నంబర్ వరకు పదోన్నతులు నిలిచిపోయాయో ఆ తర్వాత ఉండే వారి నుంచి పదోన్నతులు ఇవ్వనున్నారు. ఒకటి అంతకంటే ఎక్కువ సబ్జెక్టులకు అర్హత కలిగి ఉండి, ఏదైనా ఒక సబ్జెక్టుకు నాట్ విల్లింగ్ ఇచ్చినట్లయితే అట్టివారు మిగిలిన సబ్జెక్టు పోస్టులకు సంబంధించి ఒక ఏడాది పాటు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్‌కు అవకాశాన్ని నిలిపివేస్తారు. సీనియారిటీ జాబితాలో పేరు ఉండి, కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారిని ప్రమోషన్‌కు అన్ విల్లింగ్‌గా పరిగణిస్తారు.



9న బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం

కర్నూలు(అర్బన్): స్థానిక మౌర్యా ఇన్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 9వ తేదీ సాయంత్రం బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు సముద్రాల హనుమంతరావు తెలిపారు. శుక్రవారం స్థానిక వేదిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని, జిల్లాలో బ్రాహ్మణులకు రుద్ర భూమి ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగ, రాజకీయ పరంగా ఉన్నత స్థానాల్లో ఉన్న బ్రాహ్మణులు పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన బ్రాహ్మణులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో శ్యామ సుందరశర్మ, రవిచంద్రశర్మ, ఆనందరావు, సండేలు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కర్ణాటక వాసి దారుణహత్య



బోయ రమేశ్(ఫైల్)

హొళగుంద: కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఆంధ్ర సరిహద్దులో హొన్నూరు గ్రామ శివారు వేదావతి నది ఒడ్డున శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు, హొళగుంద తహసీల్దారు హుసేన్‌సాహెబ్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడిది కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా శిరుగుప్ప తాలూకా కూరిగనూరు గ్రామానికి చెందిన బోయ రమేశ్ (47) అనే వ్యక్తిగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేసి హత్య చేసినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. మృతదేహం పడి ఉన్న ప్రాంతం ఆంధ్రా పరిధిలోకి రావడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరుకు తరలించారు. మృతుడికి భార్య సుమలత, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఆలూరు సీఐ దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతుడు బీజేపీ నాయకుడని, పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

అహోబిలంలో ఉద్రిక్తత

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో ఓ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్న మఠం నిర్మాణంలో ఉన్న భవనాన్ని కొందరు కూలగొట్టే విషయంలో శుక్రవారం స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. కర్ణాటకకు చెందిన కొక్కే ట్రస్ట్ ఆశ్రమం దేవస్థాన స్థలాన్ని లీజుకు తీసుకుని మఠం నిర్మిస్తోంది. ఎవరో ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ వేరే మఠం నిర్మించడం కుదరదని స్థానికులు కొందరు అభ్యంతరం తెలపడంతో నిర్మాణాన్ని వేశారు. అయితే శుక్రవారం కొందరు వ్యక్తులు నిర్మాణాలను పూర్తిగా తొలగించడంలో భాగంగా పిల్లర్లను కూలదోసే యత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య, ఎస్ఐ నరసింహులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు.

ప్రేమజంట ఆత్మహత్య

ఆదోని అర్బన్: కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని పాతబస్టాండు వద్ద శ్రీనివాసభవన్ లాడ్జిలో శనివారం ప్రేమ జంట ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామానికి చెందిన రాము(25) పని నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. అక్కడ చంద్రగిరి మండలం పానబాకం గ్రామానికి చెందిన భాస్కర్ కుమార్తె మానస(24)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అయితే రాముకు పెద్దలు రెండు నెలల క్రితం పెళ్లి చేశారు. గురువారం ఉదయం మానస, రాము..ఆదోని పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఉన్న శ్రీనివాసభవన్ లాడ్జిలో 309 నంబర్ రూమ్ తీసుకున్నారు. రాము పురుగుమందు తాగగా, మానస ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందారు. శుక్రవారం ఉదయం లాక్ అవుట్ చేయాల్సి వారు ఇంకా రాలేదని కాఫీ, టీకి కూడా ఎలాంటి ఫోన్ చేయలేదని హోటల్ సిబ్బంది రూమ్ వద్దకు వెళ్లి తలుపు తట్టినా కూడా పలకపోవడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే లాడ్జికి చేరుకున్న పోలీసులు తలుపు పగలగొట్టి చూస్తే ఒకరు ఫ్యాన్‌కు ఉరి వేసుకోవడం, మరొకరు పురుగుమందు తాగి మృతిచెంది ఉండటం గమనించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విలేకరులకు తెలిపారు.

చిన్నారిని కాటేసిన హీటర్

- ఆర్‌ఎస్ రంగాపురంలో విషాదం



చిన్నారి వేదాన్స్ (ఫైల్)

బేతంచెర్ల: అప్పటి వరకు తమ కళ్ల ముందు బుడిబుడి అడుగులు వేస్తూ కేరింతలతో సందడి చేసిన చిన్నారిని హీటర్ రూపంలో మృత్యువు కాటేసింది. ఈ విషాద ఘటన ఆర్‌ఎస్ రంగాపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ముద్దవరం అశోక్, రజనీ దంపతులకు కుమార్తె హిందు, కుమారుడు వేదాన్స్ (ఒకటన్నర ఏళ్లు) సంతానం ఉన్నారు. శుక్రవారం సాయంత్రం కుమారుడికి స్నానం చేయించేందుకు రజనీ నీళ్ల వేడి చేసేందుకు బకెట్‌లో నీరు పోసి హీటర్ ఆన్ చేసింది. ఆ తర్వాత ఇంటి పనిలో ఆమె నిమగ్నమై ఉండగా.. వేదాన్స్ ఆడుకుంటూ వెళ్లి నీటి బకెట్‌లో పడిపోయి విద్యుదాఘాతానికి గురయ్యాడు. కొద్ది సేపటి తర్వాత తల్లి గమనించి బకెట్ నుంచి బాలుడిని బయటకు తీయగా శరీరంపై బొబ్బలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కేటరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి



కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నికైన సముద్రాలను అభినందిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): పెద్ద నగరాల్లో ఉన్న విధంగా కర్నూలులో కేటరింగ్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ హోటల్స్ ఓనర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి సముద్రాల హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విజయవాడ హోటల్ హయత్‌లో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయని, ఆ ఎన్నికల్లో తనను కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్నుకున్నారన్నారు. రాయలసీమ జోన్ నుంచి తనకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారికి హోటల్ రంగంలో పనిచేసేందుకు అవసరమైన శిక్షణను ఇప్పించి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.